క్లుప్తంగా

అంగన్‌వాడీ సరకుల పంపిణీ



సరకులు అందజేస్తున్న సర్పంచ్ నరసింగరావు

మునగపాక: కాజీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ పీలా నరసింగరావు లబ్ధిదారులకు శనివారం సరకులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమన్నారు. బాలింతలు, గర్భిణులు తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ దేవి, మహిళా పోలీసు వానిష తదితరులు పాల్గొన్నారు.

28న వాహనాల వేలం

పాయకరావుపేట: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో పరిధిలోని వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 28న వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఎస్.ధర్మారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఆ రోజు ఉదయం ఎస్‌ఈబీ స్టేషన్‌లో పూర్తి వివరాలతో, ముందుగా ధరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు. వేలం ముగిసిన వెంటనే పాట మొత్తం సొమ్ము చెల్లించాలన్నారు.

మినీ వ్యాన్ ఓనర్స్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం మండలం అప్పన్నపాలెంలో వెంకటేశ్వర మినీ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా మెరుగైన వ్యాపారం చేయడంతోపాటు ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. వ్యాపారవేత్తలు రామునాయుడు, రాందాసు, చిన్నారావు, బాబ్జీ, శ్రీనివాసరావు, డ్రీమ్స్ నాయుడు, భాస్కరరావు, లాలం శ్రీను, గిరి, బాషా తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రామ్‌నాయక్

ఎస్.రాయవరం: సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రామ్‌నాయక్ సూచించారు. శనివారం వమ్మవరంలో ఫ్యామిలీ ప్లానింగ్ డాక్టర్ కాన్సెప్ట్ నిర్వహించారు. 60 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటి వద్ద పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలోని సైతారుపేటలో ఫ్యామిలీ ప్లానింగ్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ నుంచి గుడివాడ వైపు నూతన విద్యుత్ లైను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆదివారం కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. గుడివాడ, గుర్రాజుపేట, బంగారమ్మపాలెం ఇండస్ట్రియల్ ప్రాంతాల వారికి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తులు

దేవరాపల్లి : తెనుగుపూడి డా. బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ సీట్లలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్ తెలిపారు. 5వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 13 సీట్లు, 9వ తరగతిలో 5 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 10 సీట్లు, ఫస్టియర్ బైపీసీలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. సీట్లు కావాల్సిన వారు ఈ నెల 31లోగా విద్యాలయం పని చేసే వేళల్లో దరఖాస్తుతో పాటు విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులతో నేరుగా తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

సెక్యూరిటీ కల్పించాలి



కోల్‌కతా వైద్యురాలిని హత్య చేయడం చాలా దారుణం. ఈ కేసులో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాటిని నిర్ధారించి అసలైన నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలి. రోగులకు రాత్రి సమయంలో వైద్య సేవలు అందించేటప్పుడు ఆస్పత్రిలో అవసరమైన సెక్యూరిటీ కల్పించాలి. ప్రసవాలకు వచ్చే కేసులను ఇతర ఆస్పత్రులకు తీసుకెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు వైద్య సిబ్బందికి రక్షణగా సెక్యూరిటీ కల్పించాలి.

– డాక్టర్ వి.సౌందర్య, పీహెచ్‌సీ, పాయకరావుపేట



మహిళా ఉద్యోగులకు రక్షణ అవసరం



గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే మహిళా ఉద్యోగులకు రక్షణ చాలా అవసరం. పీహెచ్‌సీకి మద్యం సేవించిన వారు రావడంతో తరచూ ఇబ్బందులు పడుతున్నాం. మేము చేసే వృత్తికి కొందరు నుంచి గౌరవం లేకపోగా, చెప్పలేని మాటలు పడుతూ వైద్యం చేస్తుంటాం. ఆ సమయంలో మాపై దాడి జరిగినా రక్షణ లేదు. ప్రభుత్వం ఆలోచన చేసి రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. కనీసం పోలీస్ పికెట్ అందుబాటులో ఉండేలా చూడాలి.

– ఎస్.ఎస్.వి.శక్తిప్రియ, సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి, ఎస్.రాయవరం మండలం

అద్దె కొంపలో అగచాట్లు



నిరుపయోగంగా మారిన శిథిలావస్థ వసతి గృహం

- చాలీచాలని గదులతో విద్యార్థుల ఇబ్బందులు
- శిథిలావస్థలో ఎస్సీ బాలుర -1 వసతి గృహం
- నూతన భవనం నిర్మించాలని వేడుకోలు

పాయకరావుపేట: వసతి గృహాలపై రాష్ట్ర ప్రభుత్వం శీతకన్ను చూపుతోంది. కనీస వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరిన భవనాల్లో తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొనగా, మరికొన్ని చోట్ల అద్దె కొంపల్లో చాలీచాలని గదుల్లో అవస్థలు పడాల్సి వస్తోంది. పట్టణంలోని ఎస్సీ బాలుర -1 వసతి గృహం విద్యార్థులు అనేక ఏళ్లుగా అద్దె భవనంలోనే కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయం వెనుక పక్కన దుర్గాకాలనీలో ఎస్సీ బాలుర -1 వసతి గృహం పక్కా భవనంలో ఉండేది. ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీనిని బృందావనంలో అద్దె ఇంటికి తరలించారు. నెలకు రూ.12 వేలు అద్దె చెల్లిస్తూ ప్రభుత్వం వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. వసతి గృహంలో 65 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరికి కేవలం నాలుగు బాత్ రూమ్‌లు మాత్రమే ఉన్నాయి. ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. అత్యవసర సమయంలో వీరి బాధలు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది. 65 మంది విద్యార్థులకు నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. వీటిల్లోనే తలదాచుకుంటూ తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. రాత్రిళ్లు నిద్రించాలంటే, గదుల్లో అందరికీ చోటు చాలక హాల్లోకి రావాల్సిన దుస్థితి నెలకొంది. శీతాకాలంలో వీరి బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. చలికి వణుకుతూ నిద్రించాల్సి వస్తోంది. వసతి గృహం శిథిలావస్థకు చేరి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా, ఇంతవరకు పక్కా భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థ వసతి గృహం తొలగించి, అదే స్థానంలో నూతన భవనం నిర్మించాలని విద్యార్థులు, సిబ్బంది కోరుతున్నారు.



అద్దె ఇంటిలో వసతి గృహం

నూతన భవనం నిర్మించాలి



ఐదేళ్లుగా అద్దె భవనంలోనే వసతి గృహం నిర్వహిస్తున్నాం. చాలీచాలని గదులతో 65 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి మరలా నూతన వసతి గృహం నిర్మించాలని కోరుతున్నాం.

– వి.బాబూరావు, హెచ్‌డబ్ల్యూవో

కార్మికులకు రక్షణ కల్పించాలని ఆందోళన



అచ్యుతాపురం జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

మునగపాక (అచ్యుతాపురం): అచ్యుతాపురం సెజ్ కంపెనీల్లో కార్మికులకు రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం అచ్యుతాపురం జంక్షన్‌లో గోడపత్రిక ఆవిష్కరించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎసైన్షియా కంపెనీలో 17 మంది మృతి చెందడం బాధాకరమన్నారు. ఇంతమంది ప్రాణాలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక చట్టాలు అమలు జరిగేలా చూడాలన్నారు. సెజ్‌లో ప్రమాదాల నివారణలో భాగంగా ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పరిశ్రమలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు స్వామినాయుడు, రాజు, చందుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ద్వారబంధం ఏర్పాటు



తిమ్మరాజుపేటలో ద్వారబంధం ఏర్పాటులో భక్తులు

మునగపాక: తిమ్మరాజుపేటలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా ద్వారబంధం ప్రతిష్ట కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, అన్నమాచార్య గీతాలాపనలు చేశారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి పరమేశ్వరరావు, అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, బీసీ సెల్ అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శరగడం జగన్నాధరావు తదితరులు పాల్గొని పూజలు చేశారు. కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూడిమడక రోడ్డులో కూలిన చెట్టు



రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

మునగపాక: స్థానిక పూడిమడక రోడ్డులో తాటిచెట్టు పడిపోయింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి చెట్టును తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ చెట్టు పడిపోయి విద్యుత్తు తీగలు తెగిపోయాయి. దీంతో సరఫరాకు అంతరాయం కలిగింది. ఏఈ గోపీకృష్ణ వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

దంచికొట్టిన వాన



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షం నీరు



నక్కపల్లి : ఉపమాక మెయిన్‌రోడ్డుపై చేరిన వర్షపునీరు

కోటవురట్ల: మండలంలో శనివారం వర్షం దంచికొట్టింది. చాలా కాలంగా ఎదురు చూస్తున్న అన్నదాతలకు ఈ వర్షం సంతోషాన్ని ఇచ్చింది. ఉదయం 9 గంటలకు కుండపోతగా మొదలైన వర్షం గంటపాటు కురిసింది. దాంతో జనజీవనం స్తంభించగా, రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. ఎంపీడీవో కార్యాలయం ముందు ఎప్పటిలానే వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపించింది. పంట కాలువల్లోకి, ఇటీవల వేసిన వరినాట్లలోకి నీరు చేరింది.

వర్షంతో రోడ్లు జలమయం

నక్కపల్లి: ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీ వర్షంతో శనివారం పలు గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు భారీగా వచ్చి చేరడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. నక్కపల్లి, ఉపమాక, దేవవరం, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉద్దండపురం, తదితర గ్రామాల్లో వర్షాలకు వీధి రోడ్లపై నీరు పారింది. ఉపమాకలో వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఎదురుగా మెయిన్ రోడ్డుపైకి వర్షపునీరు చేరడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడ్డారు. నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్, చేనేత కాలనీ, తహసీల్దార్ కార్యాలయ ఆవరణ, హైస్కూలు ప్రాంతం, కొత్తపేట, రాజీవ్‌నగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లోనూ వర్షపు నీరు చేరింది.

రోడ్డు ఆక్రమణలతో నిలిచిన వర్షం నీరు

ఎస్.రాయవరం: మండలంలో శనివారం ఉదయం నుంచి కురిసిన వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. సైతారుపేట జంక్షన్‌లో రోడ్డు చెరువును తలపించింది. ఇక్కడ రోడ్డుకిరువైపులా రైతులు తమ భూములను ఎత్తు చేయడం వల్ల సమస్య తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు. జేవీ పాలెం, సర్వసిద్ధి తదితర గ్రామాల వద్ద ఆర్అండ్‌బీ రోడ్డులో తరచూ వర్షనీరు నిలిచిపోయి వాహన చోదకులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించి వర్షపునీరు పోయే కాలువలు తవ్వించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

మునగపాకలో వర్షం

మునగపాక: మండల వ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాకపోకలు సాగించేవారు అవస్థలకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. మండల సముదాయానికి వెళ్లే దారిలో వర్షపునీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు. శుభ కార్యాలు జరుపుకునే వారు వర్షంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



ఎస్.రాయవరం: సైతారుపేట జంక్షన్ వద్ద చెరువులా ఆర్అండ్‌బీ రోడ్డు



మునగపాక మండల సముదాయానికి వెళ్లే మార్గంలో నిలిచిన వర్షపునీరు

వడ్డాదిలో బస్ షెల్టర్ కూల్చివేత



పొక్లెయిన్‌తో చేస్తున్న పనులను అడ్డుకుంటున్న వీఆర్వో సుధాకర్

బుచ్చెయ్యపేట : మండలంలో గల మేజర్ పంచాయతీ వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆర్చ్ ఎదురుగా ఆర్అండ్‌బి రోడ్డు పక్కన ఉన్న బస్ షెల్టర్‌ను గ్రామానికి చెందిన వ్యక్తి తొలగించారు. సుమారు 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బస్ షెల్టర్‌ను తన భూమికి ఎదురుగా ఉందని కూల్చడంపై గ్రామస్తులు ఆగ్రహం చెందుతున్నారు. వందలాది మంది ప్రయాణికుల నీడ కోసం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను కూల్చడంపై పంచాయతీ కార్యదర్శి లవరాజు బుచ్చెయ్యపేట పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. బస్ షెల్టర్‌ను తిరిగి నిర్మించాలని ప్రయాణికులకు వసతి కల్పించాలని, గ్రామ పంచాయతీ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా అధికారులు చూడాలని గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి , వార్డు మెంబరు వరహాలబాబు కోరారు.

సందడిగా కృష్ణాష్టమి వేడుకలు

చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

నక్కపల్లి: స్థానిక గురు పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. సోమవారం కృష్ణాష్టమి కావడం, వరుసగా రెండు రోజులు సెలవు దినాలు రావడంతో ముందుగానే ఈ వేడుకలను పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో పాఠశాల విద్యార్థులు అలంకరించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు చేసిన నృత్యప్రదర్శనలు, లఘునాటికలు ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేశాయి. తమ పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వారి తల్లిదండ్రులు తిలకించి మురిసిపోయారు. అనంతరం విద్యార్థులతో ఉట్టి కొట్టే కార్యక్రమం సందడిగా జరిగింది. చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతిభ చూపిన వారికి, ఉట్టి కొట్టిన విద్యార్థికి బహుమతులు ప్రదానం చేశారు.

మునగపాక: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాటిపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉట్టి కొట్టడం, కృష్ణుడు, గోపికల నృత్యాలు, చిన్ని కృష్ణుల అల్లరి వంటి ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆశ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.



నక్కపల్లి: ఉట్టి కొట్టేందుకు పోటీ పడుతున్న విద్యార్థులు

కోటవురట్ల: పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి ప్రాముఖ్యతను హెచ్ఎం కె.వి. లక్ష్మీనారాయణ విద్యార్థులకు వివరించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉట్టి సంబరంలో హెచ్ఎం ఉత్సాహంగా పాల్గొనగా, విద్యార్థులు ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వి.అచ్యుతరావు, ఉపాధ్యాయులు రామారావు, రాము, రామలక్ష్మి, సుగుణ, దేవి, వరప్రసాద్ పాల్గొన్నారు.



మునగపాక: ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కోటవురట్ల: పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో ఉట్టి కొడుతున్న హెచ్ఎం లక్ష్మీనారాయణ



నక్కపల్లి: చిన్నికృష్ణుని వేషధారణలో చిన్నారులు

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడు అధ్యాపకుల పోస్టుల భర్తీ ప్రక్రియ చేడుతున్నామని ప్రిన్సిపాల్ బి. రాధ తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 28న స్థానిక కళాశాలలో ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. జువాలజీ పోస్టుకు ఎంఎస్‌సీ జువాలజీలో యాభై శాతం మార్కులతోను, కంప్యూటర్ సైన్స్‌కు పోస్టుకు బీటెక్ కంప్యూటర్స్‌లో యాభై శాతం మార్కులతోను, జీఎఫ్‌సీ పోస్టుకు ఎంఏ ఎకనామిక్స్(రూరల్ డెవలప్‌మెంట్)లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యే వారికి నెలకు రూ.10 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని తెలిపారు.

సెప్టెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్

నర్సీపట్నం: సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్ పేర్కొన్నారు. కోర్టు సముదాయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను ఇరువర్గాల అంగీకారంతో సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ విషయాన్ని కక్షిదారుల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తీసుకురావాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మధుసూధన్‌రావు, అదనపు సివిల్ జడ్జి రోహిత్ మాట్లాడారు.

సింహగిరిపై సెల్‌ఫోన్ కౌంటర్‌లో అక్రమ వసూళ్లు

- ఏఈవో ఆకస్మిక తనిఖీల్లో బయటపడిన వైనం

సింహాచలం: సింహగిరిపై భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్‌లో దేవస్థానం అవుట్ సోర్సింగ్ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వైనం శనివారం ఆకస్మికంగా దేవస్థానం ఏఈవో చేసిన తనిఖీల్లో బయటపడింది. వివరాలిలోకి వెళ్తే.. భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరిచే కాంట్రాక్ట్‌ను చేయలేక కాంట్రాక్టర్ ఇటీవల విరమించుకున్నాడు. దాంతో దేవస్థానమే స్వయంగా తమ సిబ్బందిని కౌంటర్లలో నియమించి సెల్‌ఫోన్ భద్రపరిచే ఏర్పాటు చేసింది. కౌంటర్లలో ఒక్కో సెల్‌ఫోన్‌కి రూ.5 చొప్పున వసూలు చేయాల్సి ఉంది. ఈ తరుణంలోనే రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అధిక వసూళ్లకు పాల్పడుతున్నారన్న విషయం ఇటీవల చర్చాంశనీయమైంది. దీంతో శనివారం దేవస్థానం ఏఈవో పాలూరి నరసింగరావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జారీ చేసిన టికెట్లు కంటే రూ.960 నగదు మహిళా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వద్ద అధికంగా ఉన్నట్టు గుర్తించారు. దీంతో రిపోర్టు తయారుచేసి దేవస్థానం ఈవో దృష్టికి తీసుకెళ్లారు.